క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


వైద్యాధికారి చిరంజీవిరెడ్డి

సిద్దవటం : సిద్దవటం లోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యాధికారిగా డాక్టర్ చిరంజీవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ తప్పనిసరి


లీడర్లకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సెక్రటరీ నరసింహారెడ్డి

రాయచోటి టౌన్ : స్కౌట్ ద్వారా క్రమశిక్షణ, సేవా భావం లభిస్తాయని, అందుకే ప్రతి పాఠశాలలో స్కౌట్ ఉండాలని స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలో నూతన యూనిట్ కమిటీ లీడర్లకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మకర్, మాస్టర్ గురునాథ రెడ్డి, స్కౌట్ మాస్టర్లు నితిన్ రెడ్డి, రఫీక్, చంద్ర శేఖర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న విలేకరులు

రాయచోటి టౌన్ : రాయచోటి మీడియా సభ్యులు రాయచోటి మాజీ జర్నలిస్ట్ సుబాష్ చంద్ర బోస్ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. సోమవారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి ఆయన భార్య వెంకటసుబ్బమ్మకు రూ.13 వేలు అందించారు. సుబాష్‌చంద్ర బోస్ గతంలో పలు పత్రికల్లో రిపోర్టర్‌గా పని చేసి తరువాత ప్రైవేట్ అగ్రికల్చర్ సేల్స్ మేనేజర్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా మే నెల 16వ తేదీ కేశాపురం వద్ద కారు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఇప్పటికే రూ.15 లక్షలు ఖర్చు చేశారు. అయినా నయం కాలేదు. మంచానికే పనిమితం అయ్యాడు. ఈ పరిస్థితిలో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సహచర జర్నలిస్టులు ఆయనకు ఈ ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బసయ్య, పివి నాగయ్య, నారాయణ, వెంకట్రామరాజు, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

జిన్నా సేవా సంస్థ ఆధ్వర్యంలో..

రాయచోటి జిన్నా సేవా సంస్థ వ్యవస్థాపకులు జిన్నా రూ.10 వేలు నగదు అందజేశారు. మంగళవారం వేలూరుకు వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి వచ్చేందుకు అంబులెన్స్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తానని ఆయన తెలిపారు.

విశిష్ట గౌరవం


వెంకటసుబ్బయ్యను అభినందిస్తున్న డాక్టర్ సాయిబాబారెడ్డి

రాజంపేట రూరల్ : అన్నమాచార్య (ఏఐటీఎస్) విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చిన్న వేంకటసుబ్బయ్యకు దక్కిన విశిష్ట గౌరవం విశ్వవిద్యాలయానికే గౌరవం తీసుకొచ్చిందని అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి కొనియాడారు. స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చిన్న వేంకటసుబ్బయ్యకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ 2024–2025 విద్యా సంవత్సరంలో 9 జర్నల్ పరిశోధనా పత్రాలను ఒకే విద్యా సంవత్సరంలో ప్రచురించినందుకు గుర్తింపుగా అమరావతిలోని వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్‌తో వెంకటసుబ్బయ్యను సత్కరించిందన్నారు. అదే విధంగా రూ.10 వేల నగదు బహుమతిని అందజేసినట్లు తెలియజేశారు. ఈ నెల 2వ తేదీన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అమరావతి వీఐటీ–ఏపీలో నిర్వహించినట్లు తెలియజేశారు. ఇదే సమయంలో పరిశోధనాభివృద్ధి విభాగ డీన్ డాక్టర్ ఎస్.శివరామిరెడ్డి, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎల్.ఓబులపతిలు అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చిన్న వేంకటసుబ్బయ్యకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అధ్వానంగా రోడ్డు

వీరబల్లి: మండలంలో వంగిమల పంచాయతీలో వనంకాడపల్లి రోడ్డు నుంచి కావలిగడ్డకు వెళ్లే రోడ్డు మార్గం చాలా దారుణంగా ఉందని, గుంతలు ఏర్పడటం వలన వర్షాలు వస్తే ప్రజలు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, అదే గ్రామ పంచాయతీకి చెందిన ప్రతాప్‌రెడ్డి సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ గ్రామం నుండి ప్రజలు వాహనాల్లో వెళ్లాలన్నా, పండించిన పంటలను తీసుకొని వెళ్లాలన్నా చాలా ఇబ్బందులకు గురువుతున్నారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయాలకు మహర్దశ

- విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి


వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆలయాలకు మహర్దశ కలిగిందని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో శ్రీ రామదూత అభయహస్త ఆంజనేయస్వామి, ధ్వజ, విఘ్నేశ్వర, వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యంస్వామి, నాగులు విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ సందర్భంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికి ఆయన చేత ప్రత్యేక పూజలు నిర్వహింప చేసి, తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 76 ఆలయాలు మంజూరు చేయించడం జరిగిందని, నియోజకవర్గంలోని పలు పెద్ద ఆలయాలకు పెద్ద ఎత్తున సీజీఎఫ్ నిధుల మంజూరుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుండటం సంతోషంగా ఉందన్నారు. దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీకాంత్‌రెడ్డికి సత్కారం

రామదూత అభయహస్త ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.22 లక్షల నిధులను మంజూరు చేయించడంతోపాటు ఆలయ నిర్మాణంలో మీ వంతు కృషి, సహకారం అభినందనీయమంటూ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత న్యాయవాదులపై ఉంది

రాయచోటి : రోజురోజుకు దిగజారిపోతున్న వ్యవస్థలను కాపాడే బాధ్యత న్యాయవాదులపై ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు శ్రీకాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలపై చర్చించారు. ఇందుకు స్పందించిన శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడం న్యాయవాదుల బాధ్యత అని అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చట్టపరంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం చర్యలను నిలదీయడానికి న్యాయవాదులు ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. న్యాయవాదులు మాట్లాడుతూ తమ పూర్తి సహకారాన్ని న్యాయపరంగా అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, న్యాయవాదులు హిదాయతుల్లా, రాజశేఖర్ రెడ్డి, రామ్ కుమార్, వెంకటేశ్వర్లు, పవనీస్ రెడ్డి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి

రాయచోటి టౌన్ : యువత స్వశక్తితో స్వయం ఉపాధి అవకావాలను కల్పించుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంతరెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గాలివీడు మండలం నూలివీడు సర్పంచ్ పెద్దు ఉమాపతిరెడ్డి కుమారుడు ఉపా శంఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన రెటీనా పేయింట్స్ లిమిటెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో రాయచోటి అన్ని రంగాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. కొత్త కొత్త వ్యాపార కేంద్రాలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు వంటివి అభివృద్ధి చెందడం హర్షణీయమన్నారు. ఇలాంటి అవకాశాలను నేటి తరం యువత సద్వినియోగం చేసుకొని స్వశక్తితో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నవాజ్, గాలివీడు మండలంలోని సర్పంచ్‌లు కేశవరెడ్డి, రామాంజులు రెడ్డి, వెంకటాద్రి, ఎంపీటీసీలు చిన్నరెడ్డి, అమానల్లా, మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నరెడ్డి, నాయకులు గుమ్మా అమరనాథరెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, భానుమూర్తిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమణారెడ్డి, పెద్దరెడ్డెన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశం

చిన్నమండెం : చిన్నమండెం మండలం పొలిమేరపల్లెలో జరిగిన సర్పంచ్ లోకేశ్వరరెడ్డి నూతన గృహ ప్రవేశ వేడుకలలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యజమానులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాలివీడు మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన బోయకొండమ్మ, పోతురాజు, సింహ బలిపీఠం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులతో గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, కుంకుమార్చన, అభిషేకం, వేదపారాయణం, జలాదివాస షోడ షోపచార పూజలు, లక్ష్మీదుర్గ చండీ హోమాలు, మంగళహారతి చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

7న మండల సమావేశం

ఓబులవారిపల్లె : మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 7వ తేదీ (గురువారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

రాయచోటి టౌన్ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరం కలసికట్టుగా పని చేద్దామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల భాస్కర్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నూతనంగా మహిళ కార్యకర్తలను చేర్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అల్ ఇండియా వార్వడ్ బ్లాక్ పార్టీకి చెందిన కోటపాటి సుబ్బమ్మ, అరుణ కుమారి, శ్రావణి, హారిక, సుందరం, వీరేంద్ర, శేఖర్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార పార్టీ ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు దర్బార్ బాష, చీఫ్ సెక్రటరీ అమీర్, సుండుపల్లె మండల అధ్యక్షులు సల్మాన్, చిన్నమండెం అధ్యక్షులు షబ్బీర్, అమీర్ బాష, రఫీ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ సోమవారం విద్యార్థులకు విలువల విద్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించే విధంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు సూచనలతో విలువల విద్య పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, శిల్పి ఆనందచారి, బోగా వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్, జివి ప్రసాదరావు, ఆర్‌వి రమణమ్మ, జ్యోతిప్రియ, గొంటుముక్కుల వెంకటరమణ, గీత, గౌరి, గాయత్రీదేవి, డాక్టర్ శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుపై సెల్‌ఫోన్ ప్రభావం

రాజంపేట టౌన్ : కంటి చూపుపై సెల్‌ఫోన్ తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నేతృత్వంలో అంగర్వాల్ ఐ హాస్పిటల్ బృందం విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల వల్ల విద్యార్థులకు కంటిచూపు సమస్యలు ఏవైనా ఉంటే తెలుసుకొని వైద్యం పొందేందుకు వీలవుతుందని వైద్యులు తెలిపారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు మణికంఠ, కె.మోహన్‌కృష్ణారెడ్డి, ఎస్.బాలాజీ, అధ్యాపకులు డాక్టర్ ఎస్.చంద్రమోహన్, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లి పాలు దోహదం

రాజంపేట రూరల్ : బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ దినదినం ఎదుగుదల చెందేందుకు తల్లి పాలు దోహదం చేస్తాయని సీడీపీఓ ఎస్.సునంద తెలియజేశారు. స్థానిక మన్నూరు అరుంధతి వాడలోని అంగనవాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగరత్నమ్మ, ఏఎన్‌ఎం నాగమణి, ఎంఎస్‌కే ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలు ఎండగడదాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఒంటిమిట్ట : అధికారం కోసం సాధ్యంకాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని వారు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గాండ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాల శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు సమగ్రాభివృద్ధికి కేరాఫ్‌గా ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పరిపాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అంటూ ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్ కల్గిన కరపత్రాలను పంచుతూ గత ప్రభుత్వ పరిపాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రం నాయుడు, కదరయ్య నాయుడు, భద్రయ్య, జేసీబీ సుబ్బారెడ్డి, మల్లిరెడ్డి, బుడ్డి శ్రీనివాసులు నాయుడు, చైతన్య, కదిరి ప్రసాద్, జైచంద్ర, నడిపయ్య, చెన్నయ్య, నాగయ్య, మధు, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్‌లు అప్పగింత


రైల్వేకోడూరు అర్బన్ : ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రైల్వేకోడూరు అర్బన్ : అంగన్‌వాడీ మినీ టీచర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్‌లను సోమవారం నియోజకవర్గంలోని 248 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో వెనక్కు ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు 11500, మినీ వర్కర్లకు 7000 జీతాలు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పుడిచ్చే జీతాలు ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం సరిపవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ లీడర్లు రమాదేవి, రాధ, పద్మజ, వనజ, జయలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో...

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ సూపర్ వైజర్లు చరవాణీలు అప్పగించడం జరిగిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లలో పనిభారం ఎక్కువ అవ్వడం, చరవాణీలు మొరాయిస్తుండటంతో సమాచారం నిక్షిప్తం చేయడం కష్టంగా మారడంతో అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ, గౌరవ అధ్యక్షురాలు ప్రభావతి, సెక్టార్ లీడర్లు రుక్మిణీ, శిరీషా, శారద, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ శంకర్

రాయచోటి జగదాంబసెంటర్ : అధ్యయన కాలం మొత్తం విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డా.పి.శంకర్ సూచించారు. రాయచోటి పట్టణం మాసాపేటలో గల శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల రూపకల్పనలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పరిశోధనల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అకడమిక్, నాన్ అకడమిక్ ప్రతిభ గల విద్యార్థులకు గుర్తింపుగా జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హీరా రాజ్‌పుత్, అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా.వి.వెంకటరమణ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ డా.ఎస్.నాగేంద్ర, ఇతర శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద రండీ టీ త్రాగుతూ మాట్లాడుకుందాం అంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, కార్యదర్శి గురుప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం కార్యవర్గ సమావేశంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రాయచోటిలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించించుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులతో కలసి రండీ టీ త్రాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మూడు నెలలు పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయి, సుజిత్, రెడ్డి నాయక్, వెంకటేశ్వర్లు, బాలాజీ, ప్రవీణ్, కరిముల్లా, శంకర్, ఇస్మాయిల్, రాజా, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిగ్రీ విద్యార్థిని మృతి


మృతి చెందిన బి.తేజ

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి గ్రామం బీసీ కాలనీకి చెందిన బత్తల తేజ (19) అనే డిగ్రీ విద్యార్థిని సోమవారం గుండెపోటుతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని కొండావాండ్లపల్లె బీసీ కాలనీ చెందిన శ్రీనివాసులు, సరస్వతీ దంపతులకు చెందిన కుమార్తె బి.తేజ రాయచోటిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండేది. ఈ క్రమంలో సోమవారం ఆమె ఇంటి వద్ద కుప్పకూలి పోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. 'బాగా చదువుకునే మా తల్లి చనిపోయింది' అంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

శ్మశాన వాటిక కబ్జాను అడ్డుకోండి


చిట్వేలి : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిట్వేలి : మండల పరిధిలోని మాలేమార్పురం బీసీ కాలనీకి సంబంధించి శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ స్పందనకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కౌన్సిలర్ సభ్యుడు తిప్పన ప్రసాద్‌లు మాట్లాడుతూ గత తహసీల్దార్ గ్రామంలో సర్వే చేసి సర్వే నెంబరు. 844లో 30 సెంట్లు ఇంటి స్థలాలకు, మిగతా భూమిని గ్రామ అవసరాలకు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసులు, దేవి, రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, శంకరయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుల్లావాండ్లపల్లెలో..

సుండుపల్లె : దళితుల శ్మశాన వాటికను కాపాడాలని కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో గుల్లావాండ్లపల్లెకు చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళ్లితే.. 200 సంవత్సరాల నుంచి తమ పూర్వీకులు అక్కడ స్మశానవాటికను జరుపుకుంటున్నారని ఇప్పుడు కొంతమంది అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దళితుల స్మశానవాటికను అధికారులకు లంచాలు ఇచ్చి రికార్డులను తారుమారు చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు గతంలో రెండు మూడు సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు తెలిపారు.

పాఠశాలలో గ్రంథాలయం విద్యార్థులకు వరం


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఒంటిమిట్ట : పాఠశాలలో గ్రంథాలయాలు ఉండడం విద్యార్థులకు వరమని మండల విద్యాశాఖ అధికారి–2 బ్రహ్మయ్య అన్నారు. రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డిచే సైన్స్ ల్యాబ్ పునఃప్రారంభించడమైంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి–2 బ్రహ్మయ్య మాట్లాడుతూ గతంలో లైబ్రరీ అవర్‌ను విద్యార్థులు వినియోగించుకొని పెద్దపెద్ద ఉద్యోగాలు పొందారని, మన పాఠశాలలోని గ్రంథాలయంలో కూడా అనేక పుస్తకాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మయ్య మధ్యాహ్న భోజన పథకంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాజారెడ్డి పాల్గొన్నారు. తమ పాఠశాల సైన్స్ ల్యాబ్‌లో అన్ని రకాల ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని పెద్ద శాస్త్రవేత్తలుగా తయారు కావాలని కోరారు.

రాయచోటి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా, రాయచోటి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. యువజన విభాగం అధ్యక్షుడిగా కేతంరెడ్డి రమేష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కె.నాగరత్నమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా కె.రమణారెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడిగా బి.సుబ్రమణ్యం, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా వి. శ్రీనివాసులు, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా ఎం.రెడ్డి నాయక్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కే ఖాదర్‌వలీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కె.మల్లికార్జునరెడ్డి, పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడిగా పి.ఉపేంద్ర, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా షేక్ అబ్బాస్, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా ఆర్. శివప్రసాద్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా ఎస్.పవన్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా టి.అరుణ కుమార్‌రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడిగా ఎస్.రెడ్డి రామును నియమించారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

రాజంపేట టౌన్: మండలంలోని ఆకేపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉదయం పది గంటల నుంచి ఖాళీగా వున్న సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు టెన్త్ మార్కులిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకురావాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు ఆరు వేల రూపాయిలు ఫీజు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. పాలిటెక్నిక్‌లో ఉత్తీర్ణత సాధిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అలాగే ఉన్నత విద్య కూడా అభ్యసించవచ్చని తెలిపారు.

గురుకుల పాఠశాలలో..

ఓబులవారిపల్లె : సంజీవపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ సోమవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఖాళీలు ఉన్నాయని, ఆగస్టు 8వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు సంబంధించిన వారికి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 97045550283 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలి


ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

రాజంపేట రూరల్ : కె.బోయినపల్లిలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సీపీ) రాష్ట్ర కమిటీ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ శ్రీధర్‌కు సోమవారం ఆర్‌సీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో పెద్ద సంఖ్యలో గృహ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అందులో నివాసంలో ఉండాలంటే కనీస వసతులయిన తాగునీరు, వీధిలైట్లు, రహదారులు, కాలువలు వంటివి కల్పించాలని కోరారు. ఇటు ప్రభుత్వం, అటు అధికారులు తక్షణమే స్పందించి వసతులపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ సభ్యుడు రమణ తదితరులు పాల్గొన్నారు.